


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**86**

(18 ' సెప్టెంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఇది ఒక విధంగా** ఆలోచిస్తే యాచనగా కనిపిస్తూంది. యాచన అనాదిగా వస్తూన్న విషయమే అయినా, అదివరకటి కంటే ఎక్కువగా పరివ్యాప్తి చెందింది.

"యాచించకుండా జీవితం గడుపుకున్నాం" అని చెప్పుకోగలవారు పూర్వం చాలామంది వుండేవారు. వారి సంఖ్య చాలా మైనారిటీలో పడింది. సరాసరి చేతులు జాచకపోయినా మనసుజాచడం సర్వసామాన్యమైంది. జాచనిదే జాము ప్రొద్దు గడవడంలేదు నిజానికి.

ఇదివరలో అయితే డబ్బులేనివాళ్ళు డబ్బుకలవాళ్ళనూ, తెలివిలేనివాళ్ళు తెలివికలవాళ్ళనూ, బలంలేనివాళ్ళు బలంకలవాళ్ళనూ అవసరాన్నిబట్టి ఎంతో బిడియపడుతూ యాచన చేస్తూవుండేవారు.

ఇప్పుడా తారతమ్యాలన్నీ పోయినాయి. చాలావరకు తారుమారు పరిస్థితులే ఏర్పడినాయి. పైగా తప్పనిసరి పరిస్థితులుకూడానేమో.

***సొమ్మిచ్చి యాచించడం.***

పూర్వపు యాచనలో చేతులు జాచడమంటే వట్టి చేతులు జాచడమనే అర్థం. ఇప్పటి పద్ధతి అదికాదు - డబ్బు చేత్తో పుచ్చుకుని యాచించడం ఒక ప్రత్యేకత. దాని వెనుక ఆవశ్యకత కూడా ఒకటి ఉంటుంది.

ఉదాహరణకు చెప్పాలంటే ఎన్నో ఉన్నాయి. కిలో పంచదార కావాలంటే డబ్బిచ్చి కీల్మోడ్చి యాచించాల్సివస్తోంది. పాలు కావాలన్నా అంతే ఇంత పశుసంపదవున్న దేశంలో సీసా పాలకోసం ఎంతో ప్రయాస పడలిసి వస్తోంది.

పాడిగలవాళ్ళు పదిమందికి అమ్ముకునేవారు. నెలవారి కాతాలుండేవి. పాలు బాగుండకపోతే అడగడానికి అవకాశం ఉండేది ఎక్కువపాలు పోయించుకునేవారు మీటర్లు పెట్టి కొలిచి, ధర తగ్గిస్తూ ఉండేవారు. ఇప్పుడు మూతలు బిగించిన సీసాలు వస్తుంటే అడిగేందుకు ఏం వుంది? అవైనా అడగ్గానే దొరుకుతున్నాయి గనుకనా!

వీధుల్లో గేదెలు కనిపించడంలేదు. పాలకావిళ్ళు అసలేలేవు. ప్రతి ఉదయం వీధుల్లో బిందె తీర్థంలాగా 'బిందెక్షీరం' ప్రత్యక్షమయ్యేవి. ఎప్పుడు కావాలన్నా దొరికేవి. ఇప్పుడేం వుంది? డిపోల వల్ల వంటి కాలిమీద తపస్సు.

***సొమ్ము ఇస్తూ సీసాల భజన***

ప్రక్కగా మురుగు కాల్వలుండటంవల్ల దోమలు కొరుకుతూ ఉండడంవల్ల అనుకోకుండా కథాకళి నృత్యం ప్రారంభమవుతుంది. రెండు సీసాలు చేతులో కలవాళ్ళు సీసాల భజన కూడా చేయడం ప్రారంభిస్తారు.

మొన్న ఒక గృహస్థు అన్నాడు "రోజుకు రెండు గంటలు పాలయాచనతో సరిపోతోంది. డొక్కు ముఖాలతో తయారు కావలసివస్తోంది. ఈ బాధకు బదులు రెండు బర్రెల్ని మేపుకోవచ్చంటే - మా ఆవిడ ఒప్పుకోవడంలేదు. "

"నేను కోడికూసే వేళ లేచి పాలసీసాలతో బయటికి నడవడం - ప్రత్యూష పవనాల హాయిని అనుభవిస్తూ చక్కని కునుకుతియ్యడం - పాలయాచనకు విమోచన నా జీవితంలో ఉండదు. బస్సుల దగ్గరకు పోతే డబ్బులు చేత్తో పుచ్చుకుని ఎన్నిరకాలో యోచించాలి. కానీ సీటుమాత్రం లభ్యంకాదు. కండక్టరు ఒక చూపు చూసి పొమ్మన్నట్లు చెయ్యివూపుతాడు. "నువ్వు అనర్హుడవు పొమ్మన్న భావం స్పష్టంగా గోచరిస్తుంది. "బదరే! బదరే! కొంచెం అర్జంటుపని.. అర్జంటుపని. " బతిమాలుతూనే ఉంటారు. బస్సు "ఏమిటా పిచ్చివాగుడు" అన్నట్లు ఎంతో దూరం పోతుంది.

మొన్న హైదరాబాదులో బస్ స్టాండులో నిలబడి ఉన్నాను, అక్కడ జరుగుతున్న తమాషాలన్నీ చూస్తూ. ఒక ఉద్యోగస్థుడికి బస్సులు రెండు మూడు తప్పిపోయాయి. అన్నిటిదగ్గర "బదరే! బదర్ అర్జంటుపని" అంటూనే వున్నాడు. కానీ లభించలేదు. మరో బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు. ఈ మధ్యలో ఆగడందేనికి? - అని కాబోలు.

"బదరే! బదరే!" మంత్రం పటిస్తూనే ఉన్నాడు.

### బస్సుస్టాండులో బదర్ స్తోత్రం

మరో రెండు బస్సులు కూడా అలాగే మోసం చేసి వెళ్ళిపోయాయి. కానీ ఆయన మాత్రం బదరే! బదర్ మంత్రం ఎంతమాత్రం ఆపలేదు. చివరకు గతి తోచక "బదరే! బదరే! అర్జంటు పని సెక్రటరేట్" అంటూనే ఒక రిక్షాలో కూలపడ్డాడు.

బస్సుల విషయం వచ్చిందిగనుక ఇక్కడ ఒక చిన్న తమాషా చెపుతున్నాను. ఇటీవల అబీద్ రోడ్డు వెంట ఒక డబుల్ డెక్కు పోతోంది. ఫుట్‌బోర్డుమీద ఒక పాతికమంది యువకులు నిలబడ్డారు. ఒకచోట బస్సు కొంచెం నెమ్మదిగా నడిచింది. ప్రక్కనే ఒక పెద్దమనిషి సైకిల్ పుచ్చుకుని నిలబడ్డాడు.

ఫుట్‌బోర్డుమీదగల ఒక వీరుడు సైకిల్ హాండిల్ గట్టిగా పట్టుకున్నాడు. మరొకడు సీటు పట్టుకున్నాడు. 'హుస్' అని దాన్నీ పైకి ఎత్తారు బస్సు స్పీడులోకి పోయింది. సైకిల్ కూడా పోతోంది. దానివెంట సైకిల్ యజమాని వెంటపడ్డాడు. ఒక అరఫర్లాంగు దూరం వెళ్ళిన తర్వాత సైకిల్ వదిలివేశారు. ఆ యజమాని వెళ్ళి తీసుకున్నాడు. ఆ దొడ్డాఫీట్ చూసి రోడ్డుమీద వారంతా ఎంతో నవ్వుకున్నారు.

యాచన విషయంలోకి వస్తే ప్రతి చిన్నపనికీ యాచన తప్పడంలేదు. అన్నిటికంటే విచిత్రమేమిటంటే ఒకరికి ఒకరు పరస్పరం సహకరించుకుంటూ, కష్టసుఖాలు పంచుకుంటూ బ్రతకవలసిన భార్యాభర్తలే.. (అంతా కాదనుకోండి - కొందరు ప్రముఖులు మాత్రమే) రోజుకు వందసార్లు యాచనలోకి దిగుతూ ఉంటారు.

### పురుష పుంగవుని చీర యాచన

"ఈ పూట కొంచెం చారు పెడతావు!? ఒంట్లో సరిగాలేదు. ఒక్కొకప్పుడు చాలులే! అట్టే అక్కరలేదు. అయినా తొందరలేదులే. ఒక అరగంట అయినా ఫర్వాలేదు" అని నమ్రతగా అడుగుతూ ఉంటారు. చారునీళ్ళకోసమే అంతగా యాచించవలసి వస్తే - తక్కిన విషయాల్లో ఎంత యాచిస్తాడో ఆ పురుషపుంగవుడు, మనం ఊహించడం కష్టం.

ఇప్పటికి కూడా కొన్ని కొన్ని సంసారాల్లో గృహిణులు భర్తవద్ద ఎంతో నమ్రత వహించి, కొన్ని సందర్భాలలో గజగజ ఒణుకుతూ - 'గాజులు వేయించుకోవాలి ఒక్క రూపాయి ఇస్తారా?' అని అడగటం అంటూ ఉందంటే ఎంతో ఆశ్చర్యం వేస్తుంది.

### చెక్కిట చిటికె - చేతులో నోటు

ఆయనగారు మంచి మూడ్‌లో ఉండి, ఆమె అర్ధాంగి అనేమాట స్ఫురణలో ఉండి కరుణిస్తే రూపాయి లభిస్తుంది. లేదా వాయిదా అన్నా పడుతుంది. మూడ్ లేని సమయంలో అయితే ఒక్క మూర్కపు చూపు మాత్రమే లభిస్తుంది.

భార్య చేతి గాజులకోసం యాచించాలా! ఒకవేళ భార్య మర్యాదకోసం అడిగినా - ప్రియుడు సరసుడైతే చెక్కిట చిన్న చిటికె, చేతిలో అయిదురూపాయల నోటు పడతాయి

Post your comments